# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఫ్రాన్స్ దేశంలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జరగనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.
2. స్వర్ణాంధ్ర 2047 సాధనలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
3. తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.
4. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో ఈనెల 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.
5. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల నామినేషన్లను అధికారులు ఈరోజు పరిశీలించనున్నారు.

==========================

విదేశీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న రాత్రి ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. ప్రధానమంత్రికి ఫ్రాన్స్ సాయుధ దళాల మంత్రి సెబాస్టియన్ లెకోర్ పారిస్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా స్పందిస్తూ పారిస్‌లో చిరస్మరణీయ స్వాగతం లభించిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఫ్రాన్స్‌లో రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు.

--------------------------

స్వర్ణాంధ్ర 2047 సాధనలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రకృతి సాగు, ఉద్యాన తోటలను పెంపొందించే కార్యక్రమాలకు బ్యాంకులు మద్దతుగా నిలవాలన్నారు. రైతుల సంక్షేమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని, ప్రభుత్వం, బ్యాంకులు కలిసి నిర్వహించాలని పేర్కొన్నారు.ఆక్వా, ప్రకృతి వ్యవసాయం, డెయిరీ రంగాలను ప్రోత్సహించాలన్నారు. అర్హులైన రైతులకు నిమిషాల్లోనే రుణాన్ని మంజూరు చేసే విధానం అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో గనులు, ఖనిజాభివృద్ధి శాఖ పై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు బాధ్యతను హైడ్రాకు అప్పగించాలని పేర్కొన్నారు. ఇసుక కోసం నమోదు చేసుకున్న 48 గంటల్లోపు వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో ఈనెల 19 నుంచి మార్చి 1వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లతో కలిసి ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల నామినేషన్లను అధికారులు ఈరోజు పరిశీలించనున్నారు. నిన్నటితో ఎన్నికల నామినేషన్లకు గడువు ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 24 నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు. మరోవైపు తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలకు ఇప్పటివరకు మొత్తం పట్టభద్రుల స్థానానికి 100 నామినేషన్లు రాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 17 నామినేషన్లు దాఖలైయ్యాయని అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీ వరకు ఉపసంహరణకు ఎన్నికల సంఘం గడువునిచ్చింది. ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనుండగా.. మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

---------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి 8 నెలల్లోనే లక్షల కోట్ల నిధులు వచ్చాయని అన్నారు. వికసిత్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తోందని ఆయన తెలుపుతూ,

వాయిస్ .. 34 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. అమరావతిలోని రాష్ట్ర

సచివాలయంలో శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.బాపిరెడ్డి, ప్రధాన అర్చకులు ముఖ్యమంత్రిని కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రిని కోరారు.

---------------------------

పరీక్ష పే చర్చా కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సూచనలు, సలహాలు తమకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని అనంతపురం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు తెలిపారు. ఢిల్లీలో నిన్న జరిగిన ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్యక్రమంను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి తెరల ద్వారా విద్యార్థులు వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో పాటించాల్సిన సూచనలను ప్రధానామంత్రి చక్కగా వివరించారని తెలిపారు.

వాయిస్..32 సెకన్లు

---------------------------

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారాయిగూడెంలో చిన్న మేడారంగా పేరొందిన సమ్మక్క, సారలమ్మ జాతర ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. మార్చి 15 వరకు ఈ జాతర జరగనుంది. ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గిరిజన గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న మారాయిగూడెంలో జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు తూర్పు, ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

---------------------------

గానగంధర్వులుఘంటసాల వెంకటేశ్వరరావు వర్థంతి ఈ రోజు. సంగీత దర్శకులుగా, నేపథ్య గాయకులుగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఘంటసాల 1922 డిసెంబర్ 4వ తేదీన కృష్ణా జిల్లా గుడివాడ వద్ద గల చౌటపల్లి గ్రామంలో జన్మించారు. ఆ అజరామర గాయకులు తెలుగుతో సహా పలు భాషల్లో ఆలపించిన గీతాలు నేటికి శ్రోతల మనసులను రంజింపజేస్తున్నాయి. 1969 నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చిన ఆయన 1974 ఫిబ్రవరి 11వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు ఈ నెల 24 వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలుపుతూ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ నిన్న నోటిఫికేషన్ ను జారీ చేశారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు 16వ శాసనసభ మూడో సమావేశాలు, అదే సమయంలో శాసనమండలి 47వ సమావేశాలు కూడా ప్రారంభమవుతాయని ఆయన స్పష్టం చేశారు.

=====================